DECCAN DEVELOPMENT SOCIETY
101, Kishan Residency, Street No.5
Begumpet, Hyderabad – 500 016, Telangana, INDIA
Tel:+91-40-27764577,27764744, Telefax:+91-40-27764722
Email: ddshyderabad@gmail.com
Project: Pastapur, Zaheerabad – 502 220, Medak Dist., Telangana. INDIA
Tel.: +91-2451-282271/282785, Telefax:+91-8451-281725
Email: ddspastapur@gmail.com
Website: www.ddsindia.com

**మే 2, 2016**

# పత్రికా ప్రకటన

బంగారు తెలంగాణ బాటలో ***మన తెలంగాణ – మన వ్యవసాయం*** అనే ఆలోచనని సర్కారు ఆలోచించినపుడు పక్కా తెలంగాణ వాదులమైన మనం అందరం చాలా సంతోషించినాము. మన తెలంగాణ వ్యవసాయంలో ఉన్న పూర్వ వైభవాన్ని మన కండ్ల ముందు మళ్ళీ చూస్తామేమో అని ఆనందించినాము. అయితే **"మన తెలంగాణ – మన వ్యవసాయం"** మన ముందు కనబడకపోయేటప్పటికి మా ఆశలన్నీ అవిరి అయినాయి. బిటి పత్తి నుంచి బయట పడుతున్నామేమో అనే ఆనందం ఇంకా పూర్తిగా ఆస్వాదించక ముందే ఏక పంట విధానాలతో పండే సోయా, మక్క లాంటి జన్యుమార్పిడికి సిద్ధమైన పంటలన్ని తీసుకువచ్చి మన మీద కొత్త పేరుతొని రుద్దనికి సర్కారు ప్రయత్నించటాన్ని మేము తీవ్రంగా నిరసిస్తున్నాము.

తెలంగాణ పవిత్ర పేరుతోని ఇటువంటి పారిశ్రామిక పంటలను మన మీద రుద్దేది అనైతికమే కాదు, ఇంకొక భయంకరమైన వ్యవసాయ భవిష్యత్తుకు మార్గం అని మన ఉద్యమ ఫలంగా జన్మించిన తెలంగాణ సర్కారుని హెచ్చరిస్తున్నాము.

ఈ **"ప్రత్యామ్నాయ"** పద్ధతికి ప్రత్యామ్నాయంగా మేము ***మా తెలంగాణ – మా వ్యవసాయం*** అనే ఒక నినాదంతోని చిన్న సన్నకారు మహిళా రైతుల నేతృత్వంలో ఒక చిన్న పాటి ఉద్యమ ప్రణాళికను ప్రారంభిద్దామని ఆలోచిస్తున్నాము. చిరుధాన్య చెల్లెండ్ల అధ్వర్యంలో సాగబోయే ఈ ఉద్యమం అసలు తెలంగాణ పంటలైన చిరుధాన్యాలు, కలిపి పంటలు (పప్పు దినుసులు, నూనె గింజలు) అన్ని కలిపిన ఒక సమగ్ర దృష్టిని ఈ సర్కారు ముందుట పెట్టబోతున్నాము.

మొన్ననే తెలంగాణలో అత్యుత్తమ రైతుగా సన్మానం పొందిన మిదొడ్డి వినోద ఒక విన్నపం రాసి తన వ్యవసాయం రూపు రేఖలను ఈ దేశం ముందు పెట్టింది. ఆమె చెప్పేటట్టు ఆమె పంటలలో అనేక రకాల అత్యుత్తమ గుణాలు కలిసి ఉన్నాయి. ఆమె మాటలతోని చెప్పాలంటే

- నా పంటలకు సాగు నీళ్ళు ఆవసరం లేదు.
- నా వ్యవసాయంతోని మనుషులకి తిండి గింజలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు అన్ని కలిసి వస్తాయి.
- నా వ్యవసాయం ద్వారా పండే పంటలల్ల అపారమైన పోషక విలవలుంటాయి.
- నా వ్యవసాయంలో మనుషుల తిండే కాకుండా, పశువులకు మ్యాత మరియు భూమికి బలం ఎప్పటికి కలిసి ఉంటాయి.
- నా పంటలకు సర్కారు ఎరువు కాని, సర్కారి మందులు కాని, బయట విత్తనాలు కాని, ఏమి ఆవసరం ఉండదు.
- నా పంటలు పేద వాళ్ళకున్న నిస్సారమైన భూమిలో కూడ పుష్కలంగా పండగల్గుతాయి.
- నా లాంటి వ్యవసాయం చేసిన ఏ రైతు కూడా ఇప్పటి వరకు ఆత్మహత్య చేసుకోలేదు.

ఇవన్నీ గుణాలు కూడిన పంటలని వినోద తన స్వంత 3 ఎకరాల భూమిలో సాగు చేసి రెండు లక్షల రూపాయల ఆదాయం సంపాదించింది. ఆమె పక్క భూమిల ఇంకొక రైతు 3 ఎకరాలలో బిటి పత్తి సాగు చేసి 10 వేల రూపాయల ఆముదాని మాత్రమే సంపాదించగలిగాడు.

ఇపుడు డబ్ల్యూటిఒలో ఒక పెద్ద పరాభావాన్ని ఎదురు చూసిన తర్వాత మన సర్కారు మేల్కొని బిటి పత్తి నుండి రైతులను దూరం చేయాలని ప్రణాళికలు వేస్తున్నది. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా రైతులు 15 ఏండ్ల కిందనే బిటి పత్తి ప్రదేశాలైన వరంగల్, అదిలాబాద్, నల్గొండ ఇకడ బిటి పత్తి పండిస్తున్న రైతులని సంవత్సరాల పొడవు మళ్ళీ మళ్ళీ సంప్రదించి దాంట్లో నుండి చిన్న రైతుల బ్రతుకు, వాళ్ళ భూమిల మీద పడుతున్న విపత్తుని చాటి చెప్పగలిగినాయి. ఈ రోజు డబ్ల్యూటిఒ కొరడా ఝుళిపించిన తర్వాత మన సర్కారు మేల్కొని ***"బిటి పత్తి ఒక విపత్తి"*** అని అర్థం చేసుకుంటున్నాయి.

అయితే మన దురదృష్టం ఎందంటే మనం ఒక విపత్తి నుండి ఇంకొక విపత్తి వైపు పరుగు తీస్తున్నాం. బిటి పత్తి వద్దు అనేది చాల మంచిదే కాని, సర్కారు ఆలోచిస్తున్న, చూపెడుతున్న ప్రత్యామ్నాయాలు నిజంగానే ప్రత్యామ్నాయాలా? సోయా ఒక పెద్ద వ్యవసాయ రక్షక పంటగా మన సర్కారుకి అనిపిస్తున్నది. అయితే ఒకసారి వ్యాపారంగా సోయా పరుసుకుంటే ఏ విధంగా పత్తి పంటలో బిటి వచ్చిందో అదే విధంగా సోయా వెనక జన్యుమార్పిడి సోయా కూడ ఉంటుంది. పెద్ద ప్రమాణంలో జన్యుమార్పిడి సోయాని సాగు చేసిన అర్జెంటిన, బ్రెజిల్, అమెరికా లాంటి దేశాలు నేర్చుకున్న గుణపాఠాలు మన కండ్ల ముందర స్పష్టంగా ఉన్నాయి. సోయా పంట నుండి అక్కడ రైతులకు ఒక్క డాలర్ ఎక్కువ ఆదాయం రాలేదు, వాళ్ళ సాగు భూములు ఎడారిగా మారినాయి. ఇదే కథ పారిశ్రామిక మక్క జొన్నలకు పుట్టినిల్లు అయిన మెక్సికో లాంటి దేశాలు ఇపుడు పూర్తిగా జన్యుమార్పిడి మక్కని వ్యతిరేకిస్తున్నాయి. అక్కడంతా పరాభావాన్ని చూసిన జన్యుమార్పిడి విత్తన పరిశ్రమలు ఇపుడు తెలంగాణ అనువంటి రాష్ట్రాలను తమ గుప్పిట్లో తీసుకొననికి సన్నహాలు చేస్తున్నాయి.

ప్రస్తుతం తెలంగాణలో తీవ్ర నీటి కరువు ఎద్దడి ఉన్నప్పటికి వరి పండియ్యమని రైతులను ప్రోత్సహించడానికి చేస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు మాకు చాలా బాధ కల్గిస్తుంది. ఒక కిలో వరి పండియ్యాలంటే 4000 వేల లీటర్లు నీరు ఖర్చు అవుతుంది. అయితే 2014 ఏడాదిలో 877236 హెక్టార్లలో చిరుధాన్యాలు పండించడం వల్ల 115689883680000 లీటర్ల నీళ్ళను ఆదా చేసింది.

ఈ అంతర్జాతీయ ఆహార రాజకీయాలతో పాటు మన సర్కారు ఆలోచిస్తున్న అపరాల సాగు కూడా అంతే అపాయంతోని కూడిన ఆలోచన. అన్ని రకాల పప్పు దినుసులు పురుగు బాధలకు తొందరగా గురి అవుతాయి. అసలైన తెలంగాణ వ్యవసాయం దీనికి అడ్డుకట్ట వేసింది. మన వ్యవసాయంలో అంతర్భాగం అయిన కలిపి పంటల సాగు నుండి ఏక పంటలైన పప్పు ధాన్యాలకు తిరోగమిస్తే ఆ పద్ధతిని ఆహ్వానించినట్టే. మళ్ళీ చీడ పురుగుల రోగాల ఉధృతి, రసాయనిక మందుల వాడకం అనే ఒక విష వలయంలో మనము మళ్ళీ కొట్టుకుపోతాము. ఒక పక్కన సర్కారు సేంద్రియ వ్యవసాయానికి కట్టుబడి ఉన్నదని చెప్పుకుంటు ఇంకొక పక్కన ఇటువంటి విపత్కర పరిణామాలకి దారి తీస్తు ఉండడం చాలా శోచనీయం.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని మన తెలంగాణకి ఒక బంగారు వ్యవసాయం కావాలంటే మన రైతుల తెలివి జ్ఞానం సమకూర్చిన జొన్న, సజ్జ, కొర్ర, సామ మరియు 10 రకాల పప్పు ధాన్యాలు, నూనె గింజలు, తనే వచ్చే ఆకుకూరలు ఇవన్నీటిని సమర్థంగా అందించి మన ఆరోగ్యాన్ని కాపాడుకొని, మన పశువులకు మ్యాత కల్గిస్తూ, మన భూములకి బలం కూరుస్తు, మన రైతుల ఆత్మహత్యలని ఆపుతూ వచ్చిన అసలైన తెలంగాణ వ్యవసాయ విధానాన్ని మనం మళ్ళీ ప్రోత్సహించాలి, ఇదే మన సర్కారు తెలంగాణ రైతంగానికి అందివ్వవలసిన ప్రత్యామ్నాయం.

**ఇట్లు**

**పి.వి. సతీష్**

**డైరెక్టర్, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ**